క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



కమలాపూర్: మండలంలోని కానిపర్తిలో స్నేహ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎంపీడీఓ తొగరి హనుమయ్య తన తల్లిదండ్రులు కనుకమ్మ–ఐలయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు కొత్తూరి ఇంద్రసేన, ప్రధాన కార్యదర్శి నరెడ్ల సీతారాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జనగాని సుమన్, ఉపాధ్యక్షులు జనగాని సాంబయ్య, మాదిరెడ్డి సంధ్యారాణి, కోడిగూటి బాలరాజు, కన్నెబోయిన అశోక్, నరేందర్‌రెడ్డిపాల్గొన్నారు.

షోడషపల్లిలో పోలీస్ కళాజాతా



వేలేరు : మండలంలోని షోడషపల్లి గ్రామంలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన కళాజాతా పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాబృందం వారు రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, చేతబడి, మూఢనమ్మకాలు, సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, కానిస్టేబుళ్లు సుందర్ రాజ్, విలియం, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

నిట్‌లో వీధి కుక్కల స్వైరవిహారం



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని క్యాంపస్‌లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ విద్యార్థులపై దాడికి దిగుతున్నాయి. తరగతి గదులు, ల్యాబ్స్‌లు ఆడిటోరియం, అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియం వద్ద తిష్ఠ వేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీధి కుక్కల బెడదను అరికట్టాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరారు.

శీతల పానీయాలు వద్దు



నయీంనగర్: శీతల పానీయాలు వద్దు –సహజ పానీయాలు ముద్దు అంటూ జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కేయూసీ జంక్షన్‌లో ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు మాట్లాడుతూ కూల్‌డ్రింక్స్ తయారీలో అనేక హానికరమైన రసాయనిక పదార్థాలు కలుస్తాయని, అవి శరీర కణాల్లోని ఆక్సిజన్ నిల్వలను తగ్గిస్తాయన్నారు. తద్వారా క్యాన్సర్‌తో పాటు ఇతర అనేక రోగాలకు దారితీయవచ్చని చెప్పారు. కూల్‌డ్రింక్స్‌లో వాడే కృత్రిమ తీపి పదార్థం చక్కెర కంటే 200 రెట్లు తీయగా ఉండి క్యాన్సర్‌కు కారకమవుతుందని వివరించారు. పర్యావరణ విభాగం కన్వీనర్ ధర్మప్రకాష్ మాట్లాడుతూ ఎలాంటి పోషక విలువలు లేని కూల్‌డ్రింక్ తాగడం వల్ల లాభం కంటే నష్టాలే అధికమన్నారు. సహజ పానీయాలు అయిన నిమ్మరసం, చెరుకు రసం, మసాలా మజ్జిగ, కొబ్బరినీళ్లు, రాగి అంబలి, వేసవి పానకం తాగడం ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. కార్యక్రమంలో మురళీమోహన్, ప్రవీణ్, అగ్రణ్య, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల బలవంతపు వసూళ్లు


నయీంనగర్: నగరంలోని చాలా కూడళ్లలో హిజ్రాలు తిష్టవేసి ప్రయాణికులు, వాహనదారులు నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇవ్వని, ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించిన వారిపైన చిందులు వేస్తున్నారు. అశోకా కూడలి, పెట్రోల్‌పంపు, కేయూ క్రాస్, అదాలత్, కాజీపేట, పోచమ్మమైదాన్, కాశిబుగ్గ, వరంగల్ పోస్టాఫీస్, ట్రాఫిక్ జంక్షన్లను హిజ్రాలు అడ్డాగా మార్చుకుని డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. కనీసం 10 రూపాయలైనా ఇవ్వాలని పట్టు పడుతున్నారని బాధితులు వాపోతున్నారు. ద్వంద్వార్థాలతో హేళన చేస్తున్నారని చెబుతున్నారు. చాలామంది వాహనదారులు వారిని చూడగానే భయపడిపోతున్నారు. అధికారులు చొరవ తీసుకుని హిజ్రాల బెడదను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

నిఘా నేత్రాలతో భద్రత

- ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు
- నిందితులను పట్టిస్తున్న సీసీ ఫుటేజీలు
- తగ్గిన నేరాలు, హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



దామెరలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



పోలీస్ స్టేషన్‌లోని టీవీలో సీసీ ఫుటేజీలు

దామెర : ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి క్షేమంగా వస్తాడా అని భయపడే పరిస్థితి ఒకవైపు, తిరిగి వచ్చే సరికి ఇంట్లో దొంగలు పడతారేమోననే అనుమానం మరో వైపు ఉండేది. ఇలాంటి భయాందోళనలు నాడు నగరాలకే పరిమితమైన నేరాలు, రోడ్డు ప్రమాదాలు నేడు పల్లెల్లో కూడా జరుగుతుండటంతో ప్రజలు భయంగుప్పిట్లో బ్రతుకుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు ఒక మంచి ఆలోచనతో గ్రామాల్లో నేరాలను నియంత్రిస్తున్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు అమర్చి వాటి ద్వారా పోలీసులు నిరంతరం నిఘాను పెంచడంతో పాటు శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారు. మండలంలో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

మండలవ్యాప్తంగా 133 కెమెరాలు ఏర్పాటు

దామెర పోలీస్‌స్టేషన్ పరిధిలోని 15 గ్రామాలతో పాటు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కలుపుకొని మొత్తం 133 ఏర్పాటు చేశామని ఎస్సై కొంక అశోక్ తెలిపారు. మండల కేంద్రంలో 10, ల్యాదల్లలో 12, వెంకటాపూర్‌లో 02, సింగరాజుపల్లిలో 03, ఒగ్లాపూర్‌లో 04, పులుకుర్తిలో 22, ఊరుగొండలో 32, తక్కళ్లపహాడ్‌లో 16, ముస్త్యాలపల్లిలో 06, దమ్మన్నపేట్‌లో 03, కోగిల్వాయిలో 05, పసరగొండలో 04, కొకొండ 05, రామకృష్ణాపూర్ 05, కంఠాత్మకూర్ 05 కెమెరాలను అమర్చారు. అంతేకాకుండా హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారిపై డిస్నీల్యాండ్ పాఠశాల సమీపంలో 03, పసరగొండ క్రాస్ రోడ్డు వద్ద మరో 03 మొత్తం 5 హైపవర్ సీసీ కెమెరాలను అమర్చారు.

అవగాహన సదస్సులు

ఒక సీసీ కెమెరాల పనితీరుపై గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. షాపుల్లో, హోటళ్లు, పెట్రోల్ బంకుల్లో, కళాశాలల్లో, పాఠశాలల్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని షాపుయజమానులకు పోలీస్‌లు సూచిస్తున్నారు. ఇంటి దొంగలను పట్టించే సీసీ కెమెరాలు ప్రతి ఇంటి ఆవరణలో ఏర్పాటుచేసుకోవాలని కోరుతున్నారు.

నిరంతరం పర్యవేక్షణ



ప్రతి గ్రామంలోని ముఖ్యకూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆ కెమెరాలను పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశాం. పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీవీల ద్వారా కెమెరాల నుంచి ప్రసారం అవుతున్న దృశ్యాలను(సీసీ ఫుటేజ్‌లను) పర్యవేక్షిస్తున్నాం. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కెమెరాల్లో కొన్నింటికి సమస్యలు తలెత్తాయి. త్వరలో వాటికి మరమ్మతు చేసి వినియోగంలోని తీసుకొస్తాం.

– ఎస్సై కొంక అశోక్

ప్రశాంతంగా ఉంటున్నాం



గ్రామంలో పోలీసులు నిర్వహించిన అవగాహన సదస్సులో సీసీ కెమెరాలతో కలిగే లాభాలను తెలుసుకున్నాను. దీంతో మా ఇంటి ఆవరణలో 3 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నాను. వేసవి కాలం వచ్చిందంటే దొంగల బెడద అధికంగా ఉండేది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నాక ఎలాంటి భయాందోళన లేకుండా ధైర్యంగా ప్రశాంతంగా నిద్రపోతున్నాం.

– మోటి శంకర్‌రావు, దామెర

ఆలయంలో ప్రత్యేక పూజలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

ధర్మసాగర్: మండలంలోని ముప్పారం ముఖ్యనాథస్వామి ఆలయంలో క్రోధి నామసంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి ఉగాది పచ్చడి, బోనం సమర్పించి పూజలు చేశారు. అనంతరం దుర్గి ధ పవర్ ఆఫ్ 5 పిల్లల సినిమా టైటిల్, వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. బిగ్‌రాక్ ఫిల్మ్ ప్రొడక్షన్, తెలంగాణ వాయిస్ సంయుక్త ఆధ్వర్యంలో రమేష్ కిషన్ గౌడ్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇంటర్నేషనల్ చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించడానికి 1.30 గంటలు ఉన్న ఈ చిత్రం పంచభూతాలు వాటి ఫిక్షన్ ఆధారంగా కథ నడుస్తుందని దర్శకులు తెలిపారు. హంసిని దుర్గిగా నటించగా జీవేష్‌రెడ్డి, షణ్ముఖ్, శ్రీధర్, చతుర, ఆకర్షా, అక్షిత్ ప్రధానపాత్రలు పోషించారని అన్నారు. ప్రముఖ నటుడు రమేష్‌గౌడ్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించగా ఎంపీటీసీ పెద్ది శ్రీను, ముఖ్యనాథస్వామి ఆలయ చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర మూవీ టైటిల్‌ను ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ గడ్డం లక్ష్మిరాజేందర్, మాజీ ఎంపీటీసీ విజయ్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ అన్నం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముప్పారంలో సినిమా షూటింగ్‌లకు అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని తెలిపారు. షూటింగ్‌లకు తమవంతు సహాయ సహకారాలు అందచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దారపు రాములు, ప్రవీన్, యాదగిరి, సదానందం, అశోక్, వినోద్, నాగభూషణం, శ్రీను, కొమురయ్య, సారయ్య, భిక్షపతి, రవీందర్‌రెడ్డి, అనిల్, నరసింహస్వామి, మహేందర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడిపంటలతో చల్లగా ఉండాలి



శ్రీ కంఠమహేశ్వరుడికి పూజలు చేస్తున్న గౌడ కులస్తులు

శాయంపేట : పిల్లాపాపలు, పాడి పంటలతో అందరూ చల్లగా ఉండాలని పూజలు చేసినట్లు గౌడ కులపెద్ద గండి చేరాలు తెలిపారు. గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ కంఠమహేశ్వర, సురమాంబ దేవతలు, శ్రీ ఎల్లమ్మతల్లికి శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని మంగళవారం మండలంలోని కొప్పుల, గంగిరేణిగూడెం గ్రామాల్లోని తాటిముంజలు, ఉగాది పచ్చడితో మొక్కులు చెల్లించారు. ప్రతి సంవత్సరం ఉగాది రోజు శ్రీ కంఠమహేశ్వరునికి ఘనంగా పూజలు నిర్వహించడం గౌడ కులస్తుల ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో గౌడ కులస్తులు పోశాల ఓదేలు, కల్లెపు సుదర్శన్, బొడిగె కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ధర్మసాగర్ : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ ధర్మసాగర్ ఏఈ సుధాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా ధర్మసాగర్ ఎస్ఎస్ పరిధిలోని దేవునూర్ ఫీడర్, పెద్దపెండ్యాల ఎస్ఎస్‌లో పెద్దపెండ్యాల ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 7 నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. ఆయా గ్రామాల్లోని వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

వేలేరు: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో 33 కేవీలో అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నందున పీచర, వేలేరు, మల్లికుదుర్ల గ్రామాల సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం ఉదయం 7 నుండి 11 గంటల వరకు త్రీఫేజ్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కుమారస్వామి మంగళవారం తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ఐనవోలు: మండలంలోని వెంకటాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్టుకొమ్మల కత్తిరింపు, లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ మంగళవారం తెలిపారు. వెంకటాపూర్ విద్యుత్ వినియోగదారులతో పాటు వ్యవసాయ కనక్షన్లు కలిగిన వారికి నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. రైతులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

అంకెలు దాచి.. పోలీసులను ఏమార్చి..

- ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్న వాహనదారులు
- జరిమానాలు పడకుండా తప్పించుకు తిరుగుతున్న వైనం



కాజీపేటలో తిరుగుతున్న నంబర్ ప్లేట్‌లేని బైక్‌లు

కాజీపేట: రహదారి భద్రతా నియమావళిని అతిక్రమించిన వాహనాలను ఆపి జరిమానాలు విధించడం ఒకప్పటి పద్ధతి. ఈ–చలాన్ విధానం వచ్చాక ఆన్‌లైన్ జరిమానాల విధింపు జోరందుకుంది. ముఖ్యంగా మితిమీరిన వేగానికి క్లెం వేసేందుకు వాహనదారుడికి తెలియకుండానే స్పీడ్‌గన్ల ద్వారా ఫొటోలు తీసి జరిమానాలు విధిస్తున్నారు. సీసీ కెమెరాలు ఫొటో తీసే విధానంతో కమాండ్ కంట్రోల్ ద్వారా వాహనదారులకు జరిమానాలు బాదేస్తున్నారు. రోడ్డుపై వాహనం నిలిపి ఉంచినా.. తప్పుడు దారిలో నడిపినా.. హెల్మెంట్ ధరించకపోయినా.. అతివేగంతో వెళ్లినా, పరిమిత వ్యక్తులకు మించి ప్రయాణించినా, సిగ్నల్ జంప్ చేసినా కెమెరాలు క్లిక్‌మంటాయి. వాటన్నింటిని నుంచి తప్పించుకునేందుకు కొందరు వాహనదారులు నంబర్ ప్లేట్ కనిపించకుండా అతితెలివి తేటలు ప్రదర్శిస్తున్నారు. కొందరు నంబర్ కనిపించకుండా మాస్కులు కడ్తుంటే.. మరికొందరు ఒకట్రెండు అంకెలు కనిపించకుండా చెరిపివేస్తున్నారు. పోలీసులు ఎంతగా తనిఖీలు చేస్తున్నప్పటికీ ఈ వ్యవహారం ఆగకపోవడం శోచనీయం. ఇలా చేయడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలను, క్షతగాత్రులను గుర్తించడం పోలీసులకు ఇబ్బందికరంగా మారుతుంది. పోలీసులు తరుచూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టి నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయంలో నవరాత్రోత్సవాలు ప్రారంభం

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవాలయంలో మంగళవారం తార నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు యల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి కమల పూలతో అష్టోత్తర పూజ నిర్వహించారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

అయ్యప్ప దేవాలయంలో...

వరంగల్ భద్రకాళిరోడ్డులోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప భక్త సేవాశ్రమంలో ఉగాదిని పురస్కరించుకుని ఆలయ వ్యవస్థాపకుడు టీఆర్ బాలసుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో అర్చకుడు గణపతిశర్మ స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ఈ ఏడాది బీజేపీకి అనుకూలం

- ఎంపీ ఎన్నికల్లో గెలుపు ఖాయం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

గీసుకొండ : జ్యోతిష్య పండితుల పంచాంగ శ్రవణం ప్రకారం శ్రీక్రోధి నామ సంవత్సరం భారతీయ జనతా పార్టీకి అనుకూలమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తెలిపారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పని చేస్తే వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గీసుకొండ మండలంలోని ధర్మారంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రముఖ జ్యోతిష్య పండితులు డాక్టర్ కాళేశ్వరం సుమన్ శర్మ చేసిన పంచాంగ శ్రవణంలో రవికుమార్ పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అభ్యర్థించాలని సూచించారు. మోదీకి మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, మార్తినేని ధర్మారావు, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీశ్, డాక్టర్ కాళీప్రసాద్, ఎడ్ల అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీక్రోధి నామసంవత్సరానికి స్వాగతం



పరకాల: పంచాంగం శ్రవణం చేస్తున్న సంపత్‌కుమార్ శర్మ

దామెర: మండల వ్యాప్తంగా మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. షడ్రుచులతో కూడిన పచ్చడి, బక్షాలు తయారుచేసుకొని కొత్త బట్టలు కట్టుకొని ఆనందంగా జరుపుకున్నారు. దామేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రాజుశర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

దేవస్థానంలో ఉగాది పంచాంగం శ్రవణం

పరకాల: పరకాలలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది పంచాంగం శ్రవణం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ పంచాంగం శ్రవణం చేయగా పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, పరకాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్స్ మొగిళి, రాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐనవోలు : శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. కక్కిరాలపల్లి శ్రీలక్ష్మీనృసింహ ఆలయంలో అర్చకుడు జయకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో పంచామృతాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. మల్లన్న ఆలయంలో ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేయగా పలు ఆలయాల్లో అర్చకులు పంచాగం శ్రవణం గావించారు. కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో పర్వతవర్ధని శివమార్కండేయ స్వామి ఆలయంలో, శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయంలో, పెద్దకోడెపాకలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు మార్త రాజ్‌కుమార్, ఆరుట్ల కృష్ణమాచార్యులు, అనుదీప్ శర్మలు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిచారు. పంచాగ శ్రవణం చదివి వినిపించారు.

వేలేరు : మండలంలోని గట్టు మల్లికార్జునస్వామి వారిని ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అర్చకులు వినయ్‌శర్మ ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం చదివి వినిపించారు. పీచరలో అర్చకులు రామలింగం ఆధ్వర్యంలో గ్రామ పంచా యతీ వద్ద పంచాగ శ్రవణం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ జల్తారి సంపత్, మాజీ సర్పంచ్ మ్యాక రవీందర్, పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంతో పాటు వివిధ గ్రామాల్లో ఉగాది పండుగను పురస్కరించుకొని మంగళవారం పంచాంగ శ్రవణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆరుట్ల కేశవమూర్తి, ఆరుట్ల మాధవమూర్తి పంచాంగ విషయాలను వివరించారు.



ఐనవోలు: పంచాంగ శ్రవణం చేస్తున్న ఐనవోలు మధుకర్ శర్మ

కమలాపూర్: మండల ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీపి, చేదు, కారం, పులుపు, ఉప్పు, వగరు వంటి షడ్రుచుల కలయికతో చేసిన ఉగాది పచ్చడిని సేవించి, పిండి వంటలు భుజించారు. అనంతరం వేద పండితుల వద్ద పంచాంగ శ్రవణం చేసి తమ జాతకాలు అడిగి తెలుసుకున్నారు.

ఎల్కతుర్తి : ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండల ప్రజలు ఉగాది వేడుకలు మంగళవారం జరుపుకున్నారు. రవిశర్మ, మణిశర్మ, రోహిత్‌శర్మ పాల్గొన్నారు.



దామెర : పచ్చడి పంపిణీ చేస్తున్న రమణారెడ్డి



ఆత్మకూరు : పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు



వేలేరు : పీచరలో..



శాయంపేట : పూజల్లో పాల్గొన్న భక్తులు



కమలాపూర్ : పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు



ఎల్కతుర్తి : శివాలయంలో ..

వైభవంగా గుండ బ్రహ్మయ్య జాతర



సంగెం : మండలంలోని గవిచర్లలో గుండబ్రహ్మయ్య జాతర మంగళవారం వైభవంగా జరింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ పూజారి కార్తీక్ ఇంటి నుంచి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. రాత్రి పూట ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, కార్లు, ఆటోలు తదితర వాహనాలు గుడి చుట్టూ ప్రదక్షణ చేసి గుండ బ్రహ్మయ్యను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు గవిచర్లతో పాటుగా మండలంలోని తీగరాజుపల్లి, షాపూర్, లోహిత, రామచంద్రాపురం, ఆశాలపల్లి, కాట్రపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పర్వతగిరి సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై ఎల్.నరేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.